క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలకు ఈ నెల 18వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ ఓజేసీఏ కుమార్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. విద్యుత్ స్తంభాలు మార్చుతున్న కారణంగా పొనుగుటివలస, మారుతీనగర్, వాసవీనగర్, గాంధీనగర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఉచిత వేసవి శిక్షణ ప్రారంభం

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లిలో బొంతలకోటి సాంబమూర్తి కళామందిరం ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమైనట్లు నిర్వాహకుడు బి.శంకరరావు సోమవారం తెలిపారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ కళలతో పాటు ఇంగ్లిష్, గణితం, విజ్ఞానశాస్త్రం సబ్జెక్టులు నేర్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు కళామందిరానికి వచ్చి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలా పరీక్ష రాస్తున్నారు.. ఏయే కేంద్రాల్లో సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయి.. పరీక్ష జరిపిస్తున్న తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని, ఎవరైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ వంటి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో సమావేశం

బొబ్బిలి: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు సోమవారం సమావేశమయ్యారు. ఓటర్ల నమోదు, తొలగింపు, బదిలీ ప్రక్రియలపై వారితో ఆర్డీవో చర్చించారు. ఓటర్ల జాబితాలో సవరణలకు ఈసీ(ఎలక్షన్ కమిషన్) అవకాశం ఇచ్చిందని, గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన, సవరణకు విచ్చేసే సిబ్బందికి సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు టి.దామోదరరావు, వి.సత్యనారాయణ, ప్రభాకర్, టి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి



ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం పరిశీలించారు. కాలువలు మురుగుతో నిండిపోయి ఉండడాన్ని చూసి, సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే ప్రజల నుంచి వసూలు చేయాల్సిన అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

క్రాస్ ప్రోగ్రాం వాహనం ప్రారంభం



జెండా ఊపి, వాహనం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు సోమవారం ప్రారంభించారు. వేసవి ఎండల నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల వ్యాప్తంగా పాడైన 389 తాగునీటి బోర్లను ఈ వాహనం ద్వారా వెళ్లి, బాగుచేయనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, సర్పంచ్ వి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

వంగర: మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఆయన సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. వేసవిలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

దోమలను తరిమేద్దాం..!

- విచ్చలవిడిగా వృద్ధి చెందుతున్న దోమలు
- ప్రబలుతున్న డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా
- నివారణ చర్యల్లో అధికారుల అలసత్వం
- చిన్నచిన్న జాగ్రత్తలతో రక్షణ పొందవచ్చు..



ఇలాంటి చెత్తాచెదారమే దోమల వృద్ధికి కారణం..

రాజాం సిటీ:

దినదినాభివృద్ధి చెందుతున్న రాజాం పట్టణం దోమలకు ఆవాసంగా మారిపోయింది. పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న మురుగునీటి నిల్వల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అవి కుట్టడం ద్వారా ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నారు. దోమల నివారణ చర్యల్లో అధికారులు అలసత్వం వహించడంతోనే దోమల వృద్ధి ఎక్కువగా ఉందని పట్టణవాసులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు దోమలను తరిమేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

• దోమలు వృద్ధి చెందేది ఇక్కడే..

దోమలు ఎక్కువగా మురుగు కూపాలు, చెత్తాచెదారాలు ఉన్నచోట వృద్ధి చెందుతాయి. ఖాళీ ప్రదేశాల్లో మట్టి వేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటుంది. వాటిల్లో దోమలు పెరిగి ఆ ఖాళీ చోట్లే దోమల ఆవాసాలుగా మారుతున్నాయి.

• ఇవి పాటిస్తే చాలు..

- సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత ఇంటి తలుపులు తెరవకూడదు. ఆ సమయంలోనే దోమలు ఎక్కువగా ఉండి, ఇంట్లోకి చొరబడతాయి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. అలాగే ఇంటి పైన వాటర్ ట్యాంకు మూతలు గట్టిగా బిగించి ఉండాలి.
- ఎల్లో షేడ్ ఉండే ఎల్ఈడీ లైట్లను ఇంట్లో వాడడం వల్ల దోమలు అంతగా ఆకర్షితం కావు.

దోమల నివారణకు సోడియం ల్యాంప్స్ కూడా వాడొచ్చు.

దోమల నియంత్రణకు చిట్కాలు..

• కాఫీ డికార్షన్ వేస్తే నిర్వీర్యం..



ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెడతాయి. కాఫీ డికార్షన్ చల్లడం ద్వారా ఆ నీటిలోని దోమల గుడ్లు నీటిపైకి చేరుతాయి. అవి ఆక్సిజన్‌కు లోనుకావడం వల్ల దోమలుగా మారకుండానే నిర్వీర్యమైపోతాయి. అదే నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.

• కర్పూరంతోనూ తరమొచ్చు..



ప్రతి ఇంట్లో కర్పూరం ఉంటుంది. ఇది దోమల సంహారానికి చక్కగా పనిచేస్తుంది. చీకటి పడుతున్నప్పుడే ఇంటి తలుపులన్నీ మూసి, పెద్ద కర్పూరం వెలిగించాలి. 20 నిమిషాల తర్వాత ఒక్క దోమ కూడా కనిపించదు. చిన్న పాత్ర తీసుకుని అందులో నీరు పోసి ఒకటి లేదా రెండు కర్పూరం బిల్లలను విరిచి అందులో వేసి గదిలో పెట్టినా మంచిదే.

• ఐస్‌గడ్డలతో అరికట్టవచ్చు..



దోమలు మనం విడిచిపెట్టే కార్బన్ డయాక్సైడ్‌కు ఆకర్షితమవుతాయి. ఐస్ గడ్డలు కూడా కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. అందుకే ఐస్‌గడ్డలను ఓ బాక్స్‌లో ఉంచి ఇంట్లో అక్కడక్కడ ఉంచాలి. దోమలు వాటి దగ్గరకు చేరుతాయి. అలాంటి సమయంలో దోమల బ్యాట్‌తో వాటిని నివారించవచ్చు.

• పిచ్చిమొక్కలకు బదులు..



పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండే చోట్లు.. దోమల సంతానోత్పత్తి కేంద్రాలుగా మారుతాయి. చాలామంది అందం కోసం అనేక మొక్కలు పెంచుతారు. వాటికి బదులుగా ఇళ్లల్లో తులసి, పుదీనా, సిట్రోనెల్లా, లెమన్ గ్రాస్ వంటి మొక్కలు పెంచితే దోమలు చాలా వరకు కంట్రోల్ అవుతాయి.

• దోమల నివారణలో వెల్లుల్లి..



దోమల నివారణకు వెల్లుల్లి కూడా ఉపయోగపడుతుంది. వెల్లుల్లి వెదజల్లే ఘాటు వాసనకు దోమలు దరిచేరవు. వెల్లుల్లి రెబ్బలను మధ్యకు కట్ చేసి, ఇంటి ద్వారాలు, కిటికీల వద్ద ప్లేట్లలో ఉంచితే మంచి ఫలితం ఉంటుంది. అంతే కాకుండా కొన్ని వెల్లుల్లి రెబ్బలను చిదిమి నీళ్లలో వేసి కాచి ఆ నీటిని ఇంట్లో స్ప్రే చేసినా దోమలు ఉండవు.

ఇబ్బందులు పడుతున్నా.. చర్యల్లేవు..

రాత్రి పగలు అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు ఆలౌట్, కాయిల్స్, అగరబత్తీలు వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. దీంతో పిల్లలు శ్వాసతో ఇబ్బందులు పడుతున్నారు. దోమలు నివారణకు మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

– ఎస్.శ్రీనివాసరావు, రాజాం

దోమల నివారణ చర్యలు చేపట్టాలి..

దోమల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. మున్సిపల్ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్, కాలువల్లో మలాథియన్ స్ప్రే వంటివి చేయడం లేదు. కాలువల్లో మురుగునీరు పేరుకుపోయి ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

–పి.సత్యనారాయణ, రాజాం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాజీ ఎమ్మెల్యే శంబంగిని కలిసిన తెంటు సత్యంనాయుడు

తెర్లాం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. రెండోసారి పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తెంటు సత్యంనాయుడు.. బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న మీతో పాటు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులకు సర్వదా రుణపడి ఉంటానన్నారు. స్పందించిన ఆయన.. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, అన్నివర్గాల వారికి సమన్యాయం ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని, రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఆయన వెంట మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు మృత్యుంజయరావు తదితరులు ఉన్నారు.

బొబ్బిలి: పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన తమ్మిరెడ్డి దామోదరరావు.. మండలంలోని పక్కి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడం పట్ల మాజీ ఎమ్మెల్యే కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

లంచం ఇవ్వనిదే పని చేయరా?



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలిరూరల్: భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు పదే పదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, లంచం ఇవ్వనిదే పని చేయరా అని సీపీఎం నాయకుడు పి.శంకరరావు అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆ పార్టీ చేపడుతున్న ప్రజాచైతన్య యాత్ర.. మండల కేంద్రానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన రైతు సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికై తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రైతులంతా తమ భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని మొర్రోమంటున్నారన్నారు. లంచం ఇస్తే గానీ అధికారులు పని చేయడం లేదని కూడా చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా రైతు సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీనును కోరారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్.గోపాలం, త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూత దశలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త హరికుమార్

రాజాం: మండలంలోని సోపేరు, బొద్దాం గ్రామాల్లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీడి,మామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సోమవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.హరికుమార్.. రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. జీడి,మామిడి తోటల్లో తొలి పూత, పిందె దశలోనే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిందె దశలో పంటకు చీడపీడలు సోకితే నీటిలో కరిగే గంధకం 2 గ్రాములు, ఎసిఫేట్ 1 గ్రాము, మల్టీ కే 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పూత విచ్చు కోకముందు తర్వాత దశల్లో పురుగు, తెగుళ్ల ఉధృతి ఉంటుందని, ఆయా తెగుళ్ల తీవ్రత ఆధారంగా హెక్సాకోనోజోల్ రెండు మిల్లీలీటర్లు, దయామిదాక్సిన్‌తో కలిపి పురుగుమందును తగిన మోతాదులో స్ప్రే చేయాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఏవీఎస్ జమదగ్ని మాట్లాడుతూ మామిడి పంటలో కాయలకు సంచులు తొడిగి, పంటలో నాణ్యత సాధించవచ్చన్నారు. ఫ్రూట్ కవర్స్‌కి ఉద్యానవన శాఖ ద్వారా ఒక్కో కవర్‌కి ఒక్కో రూపాయి చొప్పున రాయితీ ఇవ్వడంతో పాటు ఒక్కో రైతుకి రూ.2.5 ఎకరాల పంట వరకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాం మండల ఉద్యానవనశాఖ అధికారి సీహెచ్ ఉమామహేశ్వరి, వీఏఏ జి.శివశంకర్, పంచాయతీ కార్యదర్శి వైఎస్సార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు లొంగకూడదు..

బొబ్బిలి: రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు లొంగకుండా మల్లంపేట రైతులకు న్యాయం చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గొల్లపల్లి రెవెన్యూ పరిధిలో గరిష్ట భూపరిమితి చట్టం కింద ఇచ్చిన భూములను ఎవరైనా తిరిగి తీసుకుంటారా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి బొబ్బిలి రాజులు సరెండర్ చేసిన భూములనే డీ–పట్టా భూములుగా పేదలకు ఎకరా చొప్పున పంపిణీ చేయడం జరిగిందన్నారు. అవే భూములు మీవి కాదని రైతులను పొమ్మనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపించి, రైతులకు భూములు అప్పగించాలని కోరారు.

నేడు అన్నసమారాధన

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేయనున్నామని ఆలయ ఈవో బీవీ మాధవరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. గత వారం జరిగిన అమ్మవారి జాతర పురస్కరించుకుని, ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

కళ్లద్దాల పంపిణీ

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరం వద్ద వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురు వృద్ధులకు విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో తనిఖీల అనంతరం కళ్లద్దాలు అవసరమైన 85 మందిని గుర్తించామని, వారికే కళ్లద్దాలు అందించడం జరిగిందన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 35 మంది ఎంపిక

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీవేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు.. శిబిరానికి వచ్చిన కంటి రోగుల కళ్లను తనిఖీ చేసి, 35 మందిని నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ఆప్తాలమిక్ అధికారి యు.మౌనిక తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300

రేగిడి: కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని ఆమదాలవలస, అప్పాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. జీడి,మామిడి తోటల్లో ఫారంపాండ్‌ల పనులు చేయాలని కోరారు. అలాగే ఉపాధి పనుల ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఘనంగా గంగమ్మ గావు సంబరాలు

బొబ్బిలి: స్థానిక ఓంకార్ థియేటర్ సెంటర్‌లోని కూరాకుల వీధిలో గంగమ్మతల్లి గావు సంబరాలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకోసారి చేసే పండగకు ఎక్కడెక్కడో స్థిరపడిన స్థానికులంతా వచ్చి, అట్టహాసంగా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి చీరలు, అరటిగెలలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్తరాంధ్ర సాధనకు కృషి

వంగర: ఉత్తరాంధ్ర సాధనకు అందరం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపకుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకుందామని, పెత్తందార్లు వద్దన్నారు. మన ప్రాంతాన్ని మనం సాధించుకునేందుకు కుల, మత, లింగ బేధం లేకుండా ముందుకు రావాలన్నారు.

దారుణం.. మురుగులోనే మంచినీటి కుళాయి!





రామభద్రపురం మండలం, రొంపల్లి గ్రామంలో దారుణం.. మురుగునీటిలోనే మంచినీటి కుళాయిలు, పైపులైన్‌లు ఉన్నాయి. స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వాలు రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నా క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నాయి. ఫలితంగా రొంపల్లి సాయిబుల వీధి, న్యూ కాలనీల్లో ప్రస్తుతం కనిపించే ఈ దారుణమైన పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. కలుషిత నీరు ప్రజల ప్రాణాలు బలిగొంటున్నా పట్టించుకోరా అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మురుగునీటిలో ఉండే పైపులైన్‌కు ఎక్కడైనా లీకు పడితే అదే మురుగు తాము తాగే నీటిలో కలిసి రాదా.. అప్పుడు తమ పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – రామభద్రపురం

ప్రియమైన పన్ను చెల్లింపుదారులారా..



రాజాం మున్సిపాలిటీ అధికారులు.. పన్ను చెల్లింపులకు సంబంధించి, వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న స్తంభానికి మైక్ పెట్టి, అందులో నుంచే పన్నుల చెల్లింపు అనౌన్స్‌మెంట్(ప్రకటన) నిరంతరాయంగా వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ప్రియమైన పన్ను చెల్లింపుదారులారా.. సకాలంలో పన్ను చెల్లించే వారికి రాయితీ సదుపాయం ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తున్నారు. అటువైపుగా వచ్చే వారంతా ఆసక్తిగా దీనిని ఆలకించే అవకాశం ఉన్నందున పన్నుల వసూళ్లు మరింత సులభతరమవుతుందని అధికారులు చెబుతున్నారు. – రాజాం

కమ్యునల్ అవార్డు అమలు చేయాలని డిమాండ్



కమ్యునల్ అవార్డు అమలు చేయాలనే నినాదంతో 'హలో దళిత, ఆదివాసీ.. చలో ఢిల్లీ' పేరిట దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 31వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. ఇదే విషయమై రూపొందించిన కరపత్రాలను ఆయన బొబ్బిలిలో సోమవారం విడుదల చేశారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అణగారిన వర్గాలకు ఓటుహక్కు, ప్రత్యేక నియోజకవర్గాల సాధనకు ఆనాటి బ్రిటిష్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్‌ను ఒప్పించి, కమ్యునల్ అవార్డు సాధించడం జరిగిందన్నారు. అయితే ఆ అవార్డు ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపించారు. దళిత, ఆదివాసీలు కూడా పాలకులు కావాలన్నా, అభివృద్ధి చెందాలన్నా కమ్యునల్ అవార్డు అమలు జరగాల్సిందేనని, దీనికోసం దళితులు, ఆదివాసీలంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. – బొబ్బిలి

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలిరూరల్: పట్టణంలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు ఎం.శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. పక్షులబంద, అమ్మిగారి కోనేరు, పూనుచెరువు, బొగ్గులబంద, కోటి చెరువులను కొంతమంది అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. కొన్నిచోట్ల అక్రమ కట్టడాలు కూడా చేశారని తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని కోరారు.

పీఆర్‌సీ బకాయిలు ఇప్పించండి



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి

బొబ్బిలి: తమకు రావాల్సిన డీఆర్, పీఆర్‌సీ బకాయిలు ఇప్పించాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, రౌతు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వెలమ వారి కల్యాణ మండపంలో ఆ సంఘ రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం జరిగింది. జూలై 2023 నుంచి పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను 10 నుంచి 15 శాతానికి పెంచాలని కోరారు. ఈహెచ్ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యానికి ఆదేశాలివ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎల్.జగన్నాథం, కార్యనిర్వాహక కార్యదర్శి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా హాజరై, ప్రశాంతంగా పరీక్ష రాశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా స్క్వాడ్‌లను నియమించారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. తాగునీరు, వైద్య శిబిరం కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



సంతకవిటిలో పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



వంగర: పరీక్ష రాసేందుకు కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు



రాజాం: వరలక్ష్మి సెయింట్ ఆన్స్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద నిర్వహిస్తున్న వైద్య శిబిరం